మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## ఎస్సీ హాస్టల్‌లో వసతుల కరువు

**-డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు**

**వర్గల్, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త):** వర్గల్ మండలకేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు వసతులు కరువయ్యాయని డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు పేర్కొన్నారు. ఎస్సీ హాస్టల్‌లో వార్డెన్ తిరుపతిని వెంటనే సస్పెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బ్యాగరి వేణు మాట్లాడుతూ ఎస్సీ హాస్టల్‌ను సందర్శించి హాస్టల్‌లో వసతులు సరిగ్గా లేకపోవడం, వార్డెన్ తిరుపతి వేతనం కోసం తప్ప హాస్టల్‌లో పనితీరు పట్టించుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. వారానికో రెండు వారాలకో ఒకసారి రెండుసార్లు హాస్టల్‌కు హాజరుకావడం ఎస్సీ హాస్టల్ విద్యార్థుల భోజనం సరిగ్గా పెట్టకపోవడంతో ఇదేమిటని ప్రశ్నించగా ఇదేమైనా మీ ఇల్లా అని మాట్లాడినట్లు విద్యార్థులు చెప్పినట్లు పేర్కొన్నారు. పిల్లల పట్ల బెదిరింపులు, సరైన ఆహారం పెట్టకపోవడంతో వారి బాధలను పంచుకున్నారు. విద్యార్థుల పట్ల అసభ్యంగా మాట్లాడి వారి మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడుతున్న వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని జిల్లా అధికారులను, ప్రభుత్వాన్ని కోరారు.

## పదేళ్ల పాపాల భైరవుడు కెసిఆర్ : అయిలేష్ యాదవ్

**హుస్నాబాద్, జనవరి 12, ప్రభాతవార్త :** రాష్ట్రంలో రైతాంగం అలమటించేలా సమైఖ్య రాష్ట్రానికి అమ్ముడుపోయిన మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పక్కాగా తెలంగాణకు పదేళ్ళ పాపాల భైరవుడని బిసి జాతీయప్రధానకార్యదర్శి అయిలేష్‌ఆదవ్ మండిపడ్డారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ తెలంగాణకు రావాలసిన క్రిష్ణా జలాల వాటాను పొందకుండా ఆంధ్రా రాష్ట్రానికి ఆ జలాలను తరలించడం సిగ్గుచేటని అంటూ ఆంధ్రా ప్రాంతంలోని రాయలసీమతో పాటు ఎనిమిది మండలాలకు జలాలను అందిస్తూ ఈ రోజు అసెంబ్లీలో చర్చ ఉన్నప్పటికి ముఖం చాటేసి రేపు నల్గొండలో పార్లమెంట్ ఎన్నికల వేటకు వెళ్ళడానికి సిద్దమవటం దారుణమని కెసిఆర్‌ ఏముఖ్య పెట్టుకుని నల్గొండ సభకు వెళతారని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో రైతాంగానికి మరణశాసనం లిఖించి అక్కడ ఓట్లు అడుక్కోవాడానికి ఎలా వెళతారని ప్రశ్నించారు. ఈ యధార్థ నిజాన్ని ప్రజలు గమనించాలని అయిలేష్‌యాదవ్ కోరారు. ఈ కార్యక్రమంలో అయిలేష్‌యాదవ్‌తో పాటు సింగిల్‌విండో ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, టిపిసిసి సభ్యులు కేడం లింగమూర్తి, బిసి సంఘం రాష్ట్ర కార్యదర్శి సముద్రాల పద్మ, అశోక్‌యాదవ్, జిల్లా ప్రచార కార్యదర్శి పచ్చిమట్ల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎం చెకింగ్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్

## ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్ పనులను పరిశీలన

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

జిల్లా కలెక్టరేట్‌లోని ఈవీఎంగోదాంలో జరుగుతున్న ఈవీఎం మీషన్ల ఫస్ట్ లెవల్ చెకింగ్ పనులను జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ సోమవారం పరిశీలించారు. అలాగే ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. ఎప్ఎల్‌సి హాల్‌లో ప్రత్యేక గుర్తింపు కార్డు, ఫోన్ బయట డిపాజిట్, డోర్ ఫ్రెమ్ మేటల్ డిటెక్టర్, హండ్ ఎల్డ్ మెటల్ డిటెక్టర్ ద్వారా పూర్తిగా పరిశీలించిన తర్వాతనే లోనికి పంపాలన్నారు. గోదాం చుట్టూ గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను అదేశించారు. ఈవీఎం మీషన్ చెకింగ్‌లను జాగ్రత్తగా అత్యంత పకడ్బంధీగా జరుపాలన్నారు. ప్రతిది ఈసీఐ నిబంధనల ప్రకారమే జరపాలన్నారు. ఈవీఎం మీషన్ల ఎప్ఎల్‌సి ప్రక్రియ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టొద్దు

**జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న గరిమా అగర్వాల్

ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యతనిస్తూ వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి ఆమె మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఎన్నో వ్యయప్రయాలకు ఓర్చి వస్తారని సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత మనపై ఉంటుందన్నారు. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డిఅర్‌ఓ నాగ రాజమ్మ, డీఅర్‌డిఎ పిడి జయదేవ్ అర్యా, వివిధశాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఎల్కలో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం



ఎల్కల్‌లో మాట్లాడుతున్న శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి

**రాయపోల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో స్వయంభుగా వెలసిన అనంత పద్మనాభ స్వామి దేవస్థానంలో సోమవారం రాజగోపురం శిఖిర, ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రాల నడుమ ప్రతిష్టాపనా కార్యక్రమాలను ఆలయ ఉత్సవ కమిటీ దిగ్విజయంగా నిర్వహించింది. దీనికి ముందు ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులు, వేదపండితులు భక్తి శ్రద్ధలతో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేశారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వహకులు రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, ప్రజాహిత పౌండేషన్ వ్యవస్థాపకులు మామిడి మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటయ్య, మాజి సర్పంచ్ కుమార్, మంకిడి స్వామి, తీగుళ్ల స్వామి, గ్రామస్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## అంగడికిష్టాపూర్‌లో పర్యటించిన అదనపు కలెక్టర్

**మర్కుక్, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్ సోమవారం మర్కుక్ మండలం అంగడికిష్టాపూర్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం, గ్రామంలో నిర్వహిస్తున్న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలలో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్‌కు యుకెజి విద్యార్థులు భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు, వాటి రాజధానులు, రాష్ట్రాల ముఖ్యమంత్రుల పేర్లను చెబుతూ వారి ప్రతిభను చూపారు. అనంతరం అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్ విద్యార్థులను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ కౌసల్యాదేవి, డిఎల్‌పిఓ వేదవతి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపిఓ రాజలింగం, పంచాయతీ కార్యదర్శి నీలిమ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓంకార్ రాధాకృష్ణ, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, హారిక, చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో అదనపు కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థినిలు

# రాష్ట్రంలో మనకు రోజులు వస్తాయి

**మాజీ మంత్రి ఈటల రాజేందర్**



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

**గజ్వేల్, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త):**

గజ్వేల్ నియోజకవర్గంలో బిజెపి నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి అతి తక్కువ కాలంలో ఎక్కువ ఓట్లు సంపాదించుకున్నతృప్తి నాకు కలిగిందని బిజెపి రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్‌పట్టణంలోని ప్రజ్ఞా గార్డెన్‌లో బిజెపి జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బిజెపి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ గడ్డమీద మనరోజులు వస్తాయని, మనమెవరమూ అధైర్యపడవద్దన్నారు. బిజెపికార్యకర్తలు కొత్త, పాత అనకుండా కండువా మెడలో వేసుకున్న ప్రతి ఒక్కరూ మన కార్యకర్తే అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పది సంవత్సరాల కెసిఆర్ పాలనలో డబ్బులు, మద్యం రాజ్యమేలిందని, 2014కు ముందు 2006 లో ఉద్యమ సమయంలో మాజీ సిఎం కెసిఆర్ కరీంనగర్‌లో పోటీచేసినప్పుడు డబ్బుతో గెలిచారన్నారు. డబ్బును, మద్యాన్ని ప్రోత్సహించేది కెసిఆరే అని అన్నారు. ప్రజల ఆస్తులకు కాపలాదారులుగా మాత్రమే ఉండాలని, ఓనర్లము కాదని, దేశ ప్రధాని నరేంద్రమోడిని చూస్తే గుర్తువస్తుందన్నారు. దేశంలో నరేంద్రమోడి ఏది చేసినా తను చేస్తున్నట్లు గర్వంగా చెప్పుకోరని, క్రిందిస్థాయిలో సైతం సఫాయి కార్మికులకు కాళ్ళు కడిగిన వ్యక్తి నరేంద్రమోడి కాదా అన్నారు. వాస్తవికతకు దూరంగా ఉన్నవారు ఎప్పుడూ నాయకుడు కాదని, 2014లో ప్రధాని నరేంద్రమోడికి 272 ఎంపి సీట్లు రాగా 2018లో 302 సీట్లు వచ్చాయని, ముచ్చటగా మూడోసారి 400 సీట్లు కైవసం చేసుకొని మరోసారి నరేంద్ర మోడి ప్రధానిఅవుతారన్నారు. ఈనెల 15న కొమురవెల్లి రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవం ఉంటుందని, ఇట్టి కార్యక్రమానికి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. నర్సాపూర్, గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట నుండి బిజెపి కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు కొమురవెల్లి మల్లన్న దేవస్థానంలో మల్లన్నను దర్శనం చేసుకొని రైల్వేస్టేషన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

### గజ్వేల్‌కు రైలు తెచ్చింది నరేంద్రమోడి

**-దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు**

మనోహరాబాద్ నుండి గజ్వేల్, సిద్దిపేట మీదుగా కొత్తపల్లి వరకు రైలు తీసుకువచ్చింది ప్రధానమంత్రి నరేంద్రమోడి అని దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు పేర్కొన్నారు. గజ్వేల్ నియోజకవర్గ బిజెపి కార్యకర్తల సమావేశానికి విచ్చేసిన సందర్భంగా వారు మాట్లాడుతూ లీడర్ అంటే పిల్లల కోడి లాగా ఉండాలని, ఏ కార్యక్రమం చేపట్టినా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పెద్దఎత్తున కార్యకర్తలను తరలించేవిధంగా ఉండాలన్నారు. ఈనెల 15న కొమురవెల్లి రైల్వేస్టేషన్ ప్రారంభానికి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిలు వస్తున్నారని, ఈ కార్యక్రమానికి ప్రతి నియోజకవర్గం నుండి భారీగా కార్యకర్తలను తరలించాలన్నారు. సుమారుగా మెదక్ పార్లమెంట్‌కు అభివృద్ధి కోసం రూ.6వేల కోట్లు ఇచ్చిన ఘనత నరేంద్రమోడిదే అన్నారు. డిపాజిట్‌లు రానివారు సైతం నియోజకవర్గంలో కొబ్బరికాయలు కొడుతున్నారని, కాంగ్రెస్, బిఆర్ఎస్ నానానికి బొమ్మ, బొరుసు అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త నాటకానికి తెరలేపిందని, ఆరు గ్యారంటీలు అమలు చేయాలంటే 16 మంది ఎంపిలను గెలిపించాలని అనడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నర్సాపూర్ బిజెపి అభ్యర్థి మురళీయాదవ్, బిజెపి నాయకులు ఆకుల రాజయ్య, రాజయ్యయాదవ్, ధరం గురువారెడ్డి, పేర్ల శ్రీనివాస్, కుడిక్యాల రాములు, ఉప్పల మధుసూదన్, బండారు మహేష్, ఎల్కంటి సురేష్, జంగం రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాదర ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌పి రూపేష్ చెన్నూరి

## మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

**-జిల్లా ఎస్‌పి సిహెచ్ రూపేష్ చెన్నూరి**

**సంగారెడ్డి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాల్సిన అవసరం ఉందని, మాదక ద్రవ్యాల వినియోగంతో ఆరోగ్యం అదోగతి పాలు కావడం తథ్యమని జిల్లా ఎస్‌పి సిహెచ్ రూపేష్ చెన్నూరి అన్నారు. సోమవారం జహీరాబాద్ సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని పివిఆర్ ఫంక్షన్ హాల్‌లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్‌పి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన పొంది జాగ్రత్తలు పాటిస్తూ ఉండాలన్నారు. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్సీ అందుబాటులో ఉన్న నేటి రోజుల్లో టెక్నాలజీని వాడుకుని అమాయకుల అసహాయతను, అత్యాశకు పోయిన వారి ఆశలను బలంగా చేసుకుని సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. విద్యార్థులు కుటుంబ సభ్యులకు సైబర్ నేరాలపై వివరించాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితాలు రోడ్డు పాలవుతున్నాయన్నారు. గంజాయి సాగు, రవాణా, అమ్మిన, సేవించిన చట్ట రీత్య కఠినంగా శిక్షించడం జరుగుతుందని హెచ్చరించారు. డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా మార్చుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు విధిగా పాటించాలని, నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు ఆస్కారాలు ఉండవన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి వాహనాలు తోలాలన్నారు. 18 సంవత్సరాల వయసు నిండినవారు డ్రైవింగ్ లైసెన్సులు పొంది వాహనాలను తోలాలన్నారు. ఫోక్సో కేసులపై ఎస్‌పి అవగాహన కల్పంచారు. విద్యార్థులు గోల్స్‌ను పెట్టుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి డాక్టర్ పి అశోక్, డిఎస్‌పి రఘు, డిఎస్‌పి సైబర్ సెల్ రవి, ఎస్‌ఐలు వెంకటేశ్, శివలింగం, వినయ్‌కృష్ణ, కే శ్రీకాంత్, వర ప్రసాద్, ఎంవిఐ జయప్రకాశ్‌రెడ్డి, డిగ్రీ కళాశాల విద్యార్థులు, అద్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆవాలతో మార్కండేయుని అద్భుత చిత్రం



**గజ్వేల్, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త):** మార్కండేయస్వామి జయంతిని పురస్కరించుకొని ఆవాలను ఉపయోగించి మూడు రోజులు శ్రమించి ధ్యానం చేస్తున్న మార్కండేయుని భారీ ప్రతిరూపాన్ని అద్భుతంగా రూపొందించి సోమవారం రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు మాట్లాడుతూ మార్కండేయ స్వామి అల్పాయుష్కుడని, అతను పదహారు సంవత్సరాలు మాత్రమే జీవిస్తాడని శివుడు వరమిచ్చాడన్నారు. ఆ సమయం పూర్తయింది. అప్పుడు మార్కండేయుడు రాత్రిపగలు శివనామ స్మరణతో భజనలతో మహాశివున్ని ఆరాధించుతున్నాడని, అప్పుడు యముడు ప్రాణాలు తీసుకుపోవడానికి వచ్చి మార్కండేయుని మీదకు యమపాశం వదిలాడు. మార్కండేయుడు శివలింగాన్ని గట్టిగా పట్టుకోగా యమపాశం మార్కండేయునితో పాటు శివలింగానికి పడగా అప్పుడు శివలింగం పగిలి అందులోనుండి శివుడు వచ్చి ఆగ్రహంతో యమున్ని తన్నాడు. మార్కండేయునికి చిరంజీవితత్వాన్ని శివుడు ప్రసాదించాడు. యముడు దండంపెట్టి వెనుతిరిగి వెళ్ళాడని, మార్కండేయుని చరిత్ర చరిత్రలో నిలిచిందన్నారు. గత సంవత్సరం సైతం 51 కిలోల బియ్యంతో చిత్రించినట్లు తెలిపారు.

## సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధం

**హత్నూర ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** హత్నూర మండలం మాదారం గ్రామంలో సోమవారం గ్యాస్ సిలండర్‌పేలి పూరిల్లి దగ్ధమైందని గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన తలారి వీరమ్మ పూరింట్లో నివాసం ఉంటుందని అన్నారు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గ్యాస్ సిలిండర్‌పేలి పూరిల్లు పూర్తిగా కాలిపోయిందని తెలిపారు. ఇంట్లోని గృహపకరణాలు, బియ్యము, నగదు, తులం బంగారం అగ్గికి అహుతి అయ్యాయని బాధితురాలు తెలిపారు. కుటుంభం కట్టుబట్టలతో మిగిలామని ప్రభుత్వం ఆదుకోవాలని అమే కోరింది.



మంటల్లో దగ్ధమైన పూరిల్లు

# అపరిశుభ్రతకు నిలయం 161 జాతీయ రహదారి

**◆ పట్టించుకోని పర్యవేక్షణ అధికారులు ◆ పనులను మమ అనిపిస్తూ జేబులు నింపుకుంటున్న వైనంన**

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**



రహదారిపై ఎండిపోయిన మొక్కలు, అండర్ పాస్ బ్రిడ్జిల కింద చెత్తచెదరం నిండిన దృశ్యం

కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మింపబడిన జాతీయ రహదారులను మెయింటినెన్స్ చేయడానికి పూర్తి బాధ్యతలను నేషనల్ హైవే అథారిటీ అధికారులకు ఉంది. దీంతో కొంత మంది అధికారులను మెయింటినెన్స్ చూడడానికి నియమించింది. వివిధ విభాగాలను కాంట్రాక్టర్లకు అప్పగించి చేతులు దులుపుకున్నారు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం గడి పెద్దపూర్ నుండి మొదలుకొని రాంపూర్ వరకు ఉన్న 161 జాతీయ రహదారిపై ఉన్న బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురైతున్నారు. తాగనీటి కొరత, అత్యవసర సమయాల్లోనసంబంధిత అధికారులకు ఫోన్ అందించేందుకుగాను ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ పనిచేయడంలేదు. రోడ్డు మధ్యలో నాటిన మొక్కలను పరిరక్షించకపోవడంతో అవి ఎండిపోయాయి. జాతీయ రహదారి పక్కన చక్కని అహ్లాదకరాన్నిచ్చే పూలమొక్కలను పెంచాల్సి ఉండగా అధికారుల నిర్లక్ష్యం కాంట్రాక్టర్ల అలసత్వం వల్ల ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతోంది. మొక్కలను సరిగ్గా పెంచి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అలాగే ఎదురెదురుగా ప్రయాణిస్తున్న వాహనదారులకు లైట్ల వెలుతురుతో రోడ్డు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఆయా గ్రామాల వద్ద నిర్మించిన వంతెన కింద లైట్లు కొన్ని వెలగకపోవడంతో చిమ్మచీకటితో ఉండడంతో అసాంఘీక కార్యకాలపాలకు అడ్డగా మారుతున్నాయి. మరి కొందరు పోకిరీలు మద్యం తాగేందుకు వంతెనను స్థావరంగా మార్చుకుంటున్నారు. దీంతో అండర్‌పాస్ బ్రిడ్జిల కింద చెత్త చెదారంతో నిండి గాలికి వాహనచోదకుల కళ్లలో పడి ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ వంతెనల వద్ద ప్రమాదాల నివారణకు గాను ఏర్పాటు చేసే ప్రమాద సూచికలు మచ్చుకైన లేవు. కాగా మెయింటినెన్స్ అధికారులు ఉన్నారా..! ఉన్న పర్యవేక్షణ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇలా వ్యవహరిస్తున్నారా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ రహదారి అంతా అపరిశుభ్రతకు నిలయం.. మొక్కలు పెంచటంలో విఫలం అంటూ వాహనాల చోదకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మెయింటినెన్స్ కార్యాక్రమాలు అడపా దడపా చేస్తూ మమ అనిపిస్తూ ప్రభుత్వ ధనాన్ని కాజేస్తున్నరన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఇకనైనా సంబంధీత అధికారులు స్పందించి తగు తీసుకుంటారో లేక వీరు కూడా మత్తులో జారుకుంటారో వేచి చూడాలి..



డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## దళితబంధు నిధులు విడుదల చేయాలి

**బెజ్జంకి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడత దళితబంధు పథకానికి నిధులు విడుదల చేసి ఎంపిక చేసిన లబ్దిదారుల ఖాతాల్లో జమచేయాలని సోమవారం జిల్లా, మండల దళితబంధు సాధన కమిటీ ఆధ్వర్యంలో డిప్యూటీసిఎం భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళితబంధు సాధన సమితి నాయకులు మహేష్, శ్రీనివాస్, బాలనర్సు, రాజేశం, తిరుపతి, పర్శరాములు, కిష్టయ్య, లక్ష్మన్, అర్జున్, సురేష్, సుదర్శన్, బాబు, పోచయ్య, శేఖర్, అనిల్, తిరుపతి, అంజి, శ్రీనివాస్ ఉన్నారు.

## కేంబ్రిడ్జ్ అవార్డులు అందుకున్న మంథన్ విద్యార్థులు



కేంబ్రిడ్జి లెర్నర్ అవార్డులు అందుకున్న విద్యార్థులు

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్ సిరీస్‌లో 2023 మార్చి మాసంలో నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ చాటిన రామచద్రాపురం మండల తెల్లాపూర్ మున్సిపాలిటి పరిధిలోని మంథన్ స్కూల్‌లో విద్యను అందుకుంటున్న 3 విద్యార్థులకు కేంబ్రిడ్జి లెర్నర్ అవార్డులతో బహుకరించారు. ముంబాయిలోని లలిత్‌లో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులకు అవార్డులను అందచేశారు. ఈ సందర్భంగా మంథన్ పాఠశాల వైస్ ప్రిన్సిపల్, అకడమిక్స్ ఆండ్ సషల్ స్టడీస్ హెడ్ రుచికా ఉపాధ్యాయ మాట్లాడుతు విద్యార్థులు అవార్డులు అందుకోవడం విద్యార్థుల, సిబ్బంది ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు.

## ఉదయ సాహితి వేదికలో గుళ్లపల్లి కాంతి కృష్ణకు చోటు

**చేర్యాల, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** ఉదయ సాహితి (సాహిత్య వికాస వేదిక) తెలంగాణ రాష్ట్ర కార్యవర్గంలో సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణానికి చెందిన గుళ్లపల్లి కాంతి కృష్ణకు చోటు దక్కింది. ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో తాను చేస్తున్న సాహిత్య కృషిని గుర్తించి తనను రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమించినట్లు ఉదయ సాహితి సంస్థ గౌరవాధ్యక్షులు దాస్యం సేనాధిపతి ఒక ప్రకటనలో తెలిపినట్లు సోమవారం కాంతి కృష్ణ తెలిపారు. పలు పుస్తకాలను ప్రచురించిన కాంతి కృష్ణ కవిగా, ఉపాధ్యాయుడిగా బాల సాహితీవేత్తగా రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందాడు. ఇప్పటికే పలు జిల్లాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థ 2024-26 సంవత్సరాల కాలానికి ఉదయ సాహితి తెలంగాణ రాష్ట్రశాఖ ఏర్పాటును ప్రకటించినట్లు కాంతి తెలిపారు. కాంతి కృష్ణ ఎంపిక పట్ల చేర్యాల రచయిత సంఘం హర్షం వ్యక్తం చేసింది.

## భానుడి ప్రతాపం... మూగ జీవాల వేదన

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**

ఫిబ్రవరిలోనే ఎండాకాలం మొదలైనట్లుంది. మండలంలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా కొడుతున్నాయి. మధ్యాహ్నం పూట భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. భానుడి ప్రతాపంతో మూగ జీవాలకు నీరు దొరక్క పోవడంతో అల్లాడిపోతున్నాయి. చిన్నశంకరంపేటలోని ఓ ఇంటి వద్ద నీటి తొట్టిలోని వానరం నీరు సేవిస్తుంటే వార్త కెమెరా క్లిక్ మనిపించింది.



చిన్నశంకరంపేటలో ఓ ఇంటి తొట్టిలో నీళ్ల తాగుతున్న వానరం

## భూవివాదంలో ఒకరి హత్య

**జోగిపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** భూ వివాదం నేపథ్యంలో ఒకరి హత్య జరిగిన సంఘటన మండల పరిధిలోని అల్మాయిపేటలో సోమవారం జరిగింది. ఇందుకు సంబంధించిన పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అల్మాయిపేటకు చెందిన రెండెకరాల భూమికి సంబంధించి ఎం.డి.మునీర్‌కు ఆయన బావమరిదితో కొంతకాలంగా వివాదం కొనసాగుతుంది. ఈ పరిస్థితుల్లో మునీర్ బావమరిది హైదరాబాదు నుంచి కొంతమందిని తీసుకునివచ్చి సోమవారంనాడు మునీర్‌ను భూమి విషయం మాట్లాడుకుందామని భూమివద్దకు రప్పించారు. అక్కడ వారిరువురి మధ్య వివాదం పెరగటంతో మునీర్ బావమరిది వెంటవచ్చిన పలువురు మునీర్(55)పై దాడిచేశారు. దీంతో మునీర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటనకు సంబంధించి మునీర్ భార్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 12 వాహనాలు సీజ్

**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**

ఇస్మాయిల్ ఖాన్‌పేట గ్రామ పరిధిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 12 వాహనాలను సీజ్ చేసినట్లు తహసీల్దార్ ఫర్హీన్ షేక్ తెలిపారు. ఇస్మాయిల్ ఖాన్‌పేట శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న తెలుసుకుని సంగారెడ్డి రూల్ ఎస్‌ఐ వినయ్‌కుమార్, పోలీసు సిబ్బంది, రెవిన్యూ ఆర్‌ఐ ప్రవీణ్‌రెడ్డిలతో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని 3 జేబీబిలను, 9 లారీలను సీజ్ చేశామన్నారు.



ఇసుకను తరలిస్తున్న లారీలను పట్టుకున్న రెవిన్యూ అధికారులు


కరపత్రాలను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

**చేర్యాల, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** బిజెపి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై ఈనెల 16న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి ఇప్పకాయల శోభ పిలుపునిచ్చారు. చేర్యాల పట్టణంలోని పౌరసరఫరాల సంస్థ వద్ద సమ్మెకు సంబంధించిన కరపత్రాలను హమాలీ కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం శోభ మాట్లాడుతూ మోడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు గడుస్తున్నా కార్మికులు, రైతులు, కూలీలు, ప్రజల సమస్యలపై పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌గా మార్చి కార్మికులను బానిసలుగా చేసే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. ప్రజల మధ్య వైశ్యమ్యాలను రెచ్చగొట్టడానికి మతతత్వ ఎజెండాను అమలు చేస్తుందన్నారు. సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు చేర్యాల పట్టణ కన్వీనర్ రాళ్లబండి భాస్కర్ హమాలి కార్మికులు కనకయ్య, చంద్రం, బాబు, రమేష్, అనిల్ కుమార్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేదలను ఆదుకోవడమే లక్ష్యంగా క్లబ్‌లు పనిచేయాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** వాసవీక్లబ్, వాసవి వనిత క్లబ్, యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో పేదలను ఆదుకోవడానికి సేవ కార్యక్రమాలు చేపట్టాలని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు, వాసవి కుటంబ సురక్ష పథకం రూపకర్త వాసవియన్ గోల్డెన్‌స్టార్ అయిత రాములు సూచించారు. సిద్దిపేటలోని వైశ్యభవన్‌లో సిద్దిపేట వాసవీ, వాసవివనిత, యూత్ క్లబ్ నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవ చేయడంలోనే జీవితంలో నిజమైనా తృప్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ నాయకులు గంప శ్రీనివాస్, ఇరుకుల ప్రదీప్‌కుమార్, గంప కృష్ణమూర్తి, పుల్లూరు శివకుమార్, నేతి వేణుకుమార్, పుల్లూరి శ్రీనివాస్, మంకాల శ్రీనివాస్, సోమ శివకుమార్, సోమ వనజ, చింత రాజేంద్రప్రసాద్,కృష్ణవేణి, అభినయ్, విద్యాసాగర్, అంజయ్య, గంప మహేందర్‌రావు, మర్యాల వీరేశం పాల్గొన్నారు.

## 19న శివాజీ విగ్రహ పునఃప్రతిష్టపాన


గోడ పత్రికను అవిష్కరిస్తున్న హిందూ వాహిని సంయోజక్ నేతలు

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** శివాజీ తల్లి జిజియా భాయి చిన్నతనం నుంచి దేశభక్తిని నూరిపోయడం వల్లే జనాలకు అండగా నిలిచి ఛత్రపతిగా స్వరాజ్యం స్థాపించగలిగాడని హిందూ వాహిని సంయోజక్ బసవరాజు సత్యం అన్నారు. ఈనెల 19న సిద్దిపేట పట్టణంలోని వెంకటేశ్వర దేవాలయం సమీపంలో హిందూ వాహిని అధ్వర్యంలో ఛత్రపతి శివాజీ విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో హిందూ వాహిని రాష్ట్ర నాయకులు భూమిరెడ్డితో కలిసి విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమం కరపత్రిక, గోడ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం అయన మాట్లాడుతూ 19న సాయంత్రం 4 గంటలకు రేణుకా మాత దేవాలయం నుంచి వెంకటేశ్వర దేవాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ర్యాలీ అనంతరం సిద్దేశ్వరానందగిరి స్వామీజీ చేతుల మీదుగా శివాజీ విగ్రహ అవిష్కరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హిందూ యువత పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. తెలంగాణ ప్రాంత హిందూ వాహిని రాష్ట్ర సంపర్క, సహసంయోజక్‌గా కస్తూరి భూంరెడ్డి, రాష్ట్ర సమాచార సేకరణ సహసంయోజక్‌గా నరహరి నూతనంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బండి కిరణ్‌కుమార్, పరశురాములు, శ్రీకాంత్, ప్రశాంత్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం తొలి బడ్జెట్

**కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్**



మాట్లాడుతున్న అత్తు

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం తొలి బడ్జెట్‌లోనే అన్ని రంగాలకు న్యాయం చేసేలా వాస్తవ ప్రజా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. ప్రజాబడ్జెట్‌ను చూసి ఓర్వలేక మాజీ సిఎం కెసిఆర్, బిఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలకు వణుక పుడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాస్తవ బడ్జెట్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని తెలిపారు. 10 యేండ్ల బిఆర్ఎస్ పాలనలో అంకెల బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రాష్ట్ర ప్రజలను మోసం చేశారని తెలిపారు.10 యేండ్లలో పోల్చితే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనే మైనార్టీలకు న్యాయం జరుగుతుందన్నారు. బిఆర్ఎస్ పాలనలో మైనార్టీలకు ఒరగబెట్టిందేమిలేదన్నారు. బిఆర్ఎస్ అవినీతిని ప్రజలకు త్వరలోనే వివరిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలల్లోనే తొలి ప్రజా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డి, డిప్యూటి సిఎం ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు మజార్ మాలిక్,గయాజుద్దీన్, రశాద్, ఫయాజ్, నజ్జు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

**సిద్దిపేట రూరల్(చిన్నకోడూరు), ఫిబ్రవరి 12,ప్రభాతవార్త :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని దాత ఏలేటి రాజిరెడ్డి అన్నారు. చిన్నకోడూరు మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాచాపూర్ విద్యార్థులకు సోమవారం రూ.25 వేల విలువ చేసే క్రీడ దుస్తులను పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించి మండలానికే అదర్శంగా నిలువాలన్నారు. తాజా మాజీ సర్పంచ్ గాజుల బాబు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఏదుల రాములు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో తాజా మాజీ ఉప సర్పంచ్ పున్నం సురేష్, ఉపాధ్యాయులు బూర శ్రీనివాస్,కత్తుల బాపురెడ్డి, రాజయ్య, రాధాకృష్ణ, సత్తయ్య, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# అధైర్య పడొద్దు భవిష్యత్తు మనదే : మాజీ ఎమ్మెల్యే

**హుస్నాబాద్, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త**

బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు అధైర్య పడవద్దని భవిష్యత్తు అంతా మనదే అని కార్యకర్తలకు ధైర్యం నూరిపోశారు మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయామని కార్యకర్తలు నిరాశ పడవద్దని ఓటమి నేర్పిన పాఠాలతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా తనను కలవాని వారికి ఎప్పటికి అందుబాటులో ఉంటానన్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ అభ్యర్థి బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ గెలుపుకు ప్రతీ ఒక్కరు సైనికుల్లా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, వైస్ చైర్మెన్ అయిలేని అనిత శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షులు వాహబ్ అన్వర్ పాషా, కౌన్సిలర్లు కొంకటి నళినిరవి, బోజు రమాదేవి రవిందర్, బొజ్జ హరీష్, నాయకులు సుద్దాల చంద్రయ్య, చిట్టిగోపాల్‌రెడ్డి, పూదరి లక్ష్మీనారాయణగౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్



మార్కండేయస్వామి జయంతి వేడుకల్లో పాల్గొన్న ప్రతాప్‌రెడ్డి

## ఘనంగా మార్కండేయస్వామి జయంతి మహోత్సవం

**-పూజలో పాల్గొన్న వంటేరు ప్రతాప్‌రెడ్డి**

**గజ్వేల్, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త):** పట్టణంలో శివమార్కండేయస్వామి జయంతి మహోత్సవ కార్యక్రమాన్ని సోమవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు తలకొక్కుల దుర్గాప్రసాద్, యువజన సంఘం అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయస్వామిని పట్టణ ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మార్కండేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా ఇట్టి కార్యక్రమానికి మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి మురళి, రాజారాం, గుండు మల్లేశం, గుండు లక్ష్మణ్, తుమ్మ శ్రీనివాస్, గాడిపల్లి శ్రీనివాస్, గాడిపల్లి విజయ్, నేత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళుతున్న ఎంపిడిఓకు సన్మానం


ఎంపిడిఓ పట్టాభిరామారావును సన్మానిస్తున్న ఎంపిపి బాలేషంగౌడ్

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలో ఎంపిడిఓగా కొద్ది కాలంగా విధులు నిర్వహిస్తున్న ఎన్.పట్టాభిరామారావు నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ కావడంతో సోమవారం మండల ఎంపిపి మెరుగు బాలేషంగౌడ్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బందితో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంపిపి బాలేషంగౌడ్ మాట్లాడుతూ పట్టాభిరామారావు ఎంపిడిఓగా మండలానికి అందించిన సేవలు మరువలేనివని, గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రతి అభివృద్ధి పనులు గ్రామాల్లో పూర్తి స్థాయిలో జరిగేలా కృషి చేశారని, అదేవిధంగా గజ్వేల్ గడా ఎంపిడిఓగా వివిధ మండలాలకు సేవలు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ శ్రీనివాస్‌వర్మ, సూపరింటెండెంట్ ఆంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ మదార్, జూనియర్ అసిస్టెంట్‌లు అనిత, యాదయ్య, పంచాయతీ కార్యదర్శులు హరిప్రసాద్, రాజగోపాల్, సతీష్, నాగరాజు, వేణు, రవి, మల్లేశం, విక్రమ్, నవీన్, కంప్యూటర్ ఆపరేటర్లు మర్రెడ్డి, కృష్ణ, నర్సింలు, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వర్గల్ ఎంపిడిఓ నల్లగొండకు బదిలీ


ఎంపిడిఓ మేరీ స్వర్ణకుమారిని సన్మానిస్తున్న దృశ్యం

**వర్గల్, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త):** ఎంపిడివో మేరీ స్వర్ణకుమారి నల్లగొండకు బదిలీ కావడంతో కార్యాలయ అధికారులు, సిబ్బంది సోమవారం ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతకొంత కాలంగా ఎంపిడిఓ మేరీ స్వర్ణకుమారి చేసిన సేవలు అంతా ఇంతా కాదని కొనియాడారు. ఆమె చేసిన సేవలను ఎప్పటికీ మరిచిపోమని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం ఉపాధ్యక్షుడు పూదరి కరుణాకర్‌గౌడ్, మండల అధ్యక్షుడు స్వామి, ట్రెజరర్ బాలరాజు, ఉపాధ్యక్షుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నాగరాజు మృతి బాధాకరం : వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డుకు చెందిన కొలిచెలిమి నాగరాజు ప్రమాదవశాత్తు కోమటిబండ వద్ద ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి సోమవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మృతునికి బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉన్నందున పార్టీ నుండి రూ.2 లక్షల బీమా చెక్కు అందిస్తామని తెలిపారు. డ్రైవింగ్ చేసే సమయంలో ఫోన్ మాట్లాడవద్దని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని వాహనదారులకు సూచించారు.

## బాధితులకు సెల్‌ఫోన్లు అందజేత

**హుస్నాబాద్, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త :** కోహెడ మండలానికి చెందిన కూడెమేత గీతతోపాటు లావుడ్య హరిలాల్, ఆవుల అభిలాష్,గీకురు శ్రీకాంత్ వారి సెల్‌ఫోన్‌లను కొన్నిరోజులక్రితం పోగొట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు వెంటనే ఐఎంఈఐ నెంబర్‌ను జోడించి ఫోన్‌ను బ్లాక్ చేశారు. ఫోన్ పోగొట్టుకున్న బాదితులు అందించిన వివరాలతో పోలీసులు పరిశోధన సాగించి సోమవారం ఇట్టి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను గుర్తించి స్వాధీనం చేసుకుని వారికి అందజేసినట్లు హుస్నాబాద్ సిఐ ఎర్రల కిరణ్ తెలిపారు. ఈ విషయంపై సిఐ మాట్లాడుతూ దొంగతనం చేసి ఎత్తుకెళ్ళిన ఫోన్‌లతోపాటు పోగొట్టుకున్న ఫోన్‌లను తమశాఖ ద్వార కేంద్ర ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీలో డబ్యూడబ్యూడబ్యూ.సిఈఐఆర్.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసుకుని ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ అధునాతన పోర్టల్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాదితులకి సెల్‌ఫోన్‌లు అందించిన వారిలో హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేష్, కానిస్టేబుల్స్ అనిల్,కుమార్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## నేరాలకు పాల్పడిన నిందితుడు అరెస్టు

**రాయపోల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏసిపి రమేష్,సైబర్ క్రైమ్ ఎసిపి శ్రీనివాస్,తొగుట సిఐ లతీఫ్ అన్నారు. హైదరాబాద్‌కు చెందిన సైబర్ నేరాలకు పాల్పడ్డ ధనాల సూరజ్ నిందితున్ని సోమవారం పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఫోటోగ్రాఫర్లకుబ్రాండెడ్ కెమెరాలను తక్కువ ధరలో ఇప్పిస్తానని వారికి ఫోన్ ద్వారా సంప్రదించి నమ్మకం కలిగించి వారికి కెమెరా ఫోటోస్ వాట్సప్‌లో పంపి వారితోసంప్రదించి నమ్మకం కలిగే విధంగా చెప్పి వారి నుంచి ఇతనికి తెలిసిన క్యాసినో అకౌంట్‌లోకి డబ్బులు మార్పిడి చేసుకునేవాడు. ఫోటోగ్రాఫర్లు సోషల్ మీడియాలో కెమెరాల కొనుగోలు గురించి వచ్చిన వివిధ ప్రకటనల్లో గల వ్యక్తుల వివరాలు ఫోన్ నెంబర్లు సమీకరించి వారికి ఫోన్ ద్వారా సోషల్ మీడియా సహాయంతో బాధితులను సంప్రదించి నమ్మకం కలిగించి వారికి బ్రాండెడ్ కెమెరాలు తక్కువ ధరలో ఇప్పిస్తానని, కెమెరా ఫోటోస్‌ని వాట్సప్‌లో పంపి వారితో సంభాషణ చేసి అదే విధంగా వారికి చెప్పి వారి నుండి తన క్యాసినో అకౌంట్‌లోకి డబ్బులు మార్పిడి చేసుకునే వాడని తెలిపారు.అ డబ్బులను గోవాలో గల క్యాసినోలాంటి ఆటలు ఆడి ఆ డబ్బులను స్థానికంగా నగదు వినియోగదారుల కేంద్రాలైనటువంట ఇంటర్నెట్ సౌకర్యం కలిగిన కేంద్రాల నుండి 2శాతంగా కమిషన్ ఇచ్చి డబ్బులు తీసుకునేవాడని తెలిపారు.ఈ విధంగా అనేక మందిని నమ్మించి మోసం చేసాడని తెలిపారు. బేగంపేటకు చెందిన సంగాని బాలరాజు ను ఫోన్ ద్వారా పరిచయం తెసుకొని పై నిందితుడు వైజాగ్ నుంచి బిల్లు లేకుండా మంచి కెమెరాలు తక్కువ ధరకు తెప్పించి ఇస్తానని చెప్పి అతనికి తేది 16-11-2023 నాడు అతనికి ఫోన్ చేసి 50 వేలకు సోని 7అర్-5డిజిటల్ కెమెరా ఇస్తానని నమ్మించి అతని నుండి 30 వేలు, 10 వేలు,5వేలు, 5 వేలు నాలుగు దఫాలుగా ఫోన్ పే గూగుల్ పే ద్వారా డబ్బులు వేయించుకొని మోసం చేసాడని తెలిపారు.అతడు బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించడం జరిగిందన్నారు. పరిశోధనలో భాగంగా అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించి సిబ్బందితో కలిసి చాకచాక్యంగాపై నింతుతున్ని పట్టుకొని విచిరణ జరపగా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో అతనిపై 30 ఫిర్యాదులు రాగా ఇప్పటివరకు వివిధ పోలీస్‌స్టేషన్‌లో 8 కేసులు నమోదయ్యాయని తెలిపారు. వీటన్నిటిలో కలిపి మొత్తం 4,46,000 వేల రూపాయలు బాధితులు కోల్పోయరన్నారు. గతంలోనూ ఇతనిని హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల ఒక కేసులో రిమాండ్ చేసి చంచల్‌గూడ జైలుకు పంపడం జరిగిందన్నారు. జైలు నుంచి విడుదలై వచ్చిన తరువాత కూడా అతని యొక్క ప్రవర్తలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. నిందితుని వద్ద నుండి ఒక మొబైల్ ఫోన్ 10 వేల రూపాయలని రికవరీ చేసి నిందుతున్ని అరెస్టు చేసి జ్యుడిషియల్ రామాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## అక్రమ ఇసుక డంపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు

**ములుగు, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త):**

ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపులపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ములుగు మండలం వంటిమామిడి శివారులో అక్రమంగా ఇసుక డంపు చేసినట్లు నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీస్ అధికారులు సిబ్బందితో కలిసి దాడిచేసి పట్టుకున్నారు. ఇట్టి ఇసుక డంపులను ములుగు పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. అలాగే కుకునూర్‌పల్లి గ్రామ శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్ అక్రమ రవాణా చేసినా, పేకాట, జూదం, గంజాయి ఇతర మత్తుపదార్థాలు విక్రయించినా, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారులకు 8712667447, 8712667446 నెంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అన్నారు.


వంటిమామిడి వద్ద ఇసుక డంపును పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు


సీపీ అనురాధను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందిస్తున్న చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ

## ఎస్ఐలుగా బాధ్యతల స్వీకరణ

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్లకు బదిలీపై వచ్చిన నూతన ఎస్ఐలు సోమవారం ఆయా పోలీసు స్టేషన్లలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. చిన్నకోడూరు ఎస్ఐగా బి.బాలకృష్ణ, రాజగోపాల్‌పేట ఎస్ఐగా యు.భాస్కర్‌రెడ్డి, కుకునూర్‌పల్లి ఎస్ఐగా పి.శ్రీనివాస్, సిద్దిపేట రూరల్ ఎస్ఐగా అపూర్వరెడ్డి, దౌల్తాబాద్ ఎస్ఐగా టి.శ్రీరామ్ ప్రేమ్‌దీప్‌లు పదవి బాధ్యతలను స్వీకరించారు. అనంతరం సిద్దిపేట సీపీ కార్యాలయంలో సీపీ డా॥అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ డా॥అనురాధ నూతన ఎస్ఐలుగా బాధ్యతలు స్వీకరించిన వారిని అభినందించారు. అనంతరం అమె మాట్లాడుతూ శాంతిభద్రతలకు పెద్ద పీట వేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు ఎల్లవేళాల అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు.

## సీసీ కెమెరాలతో ఎంతో భద్రత : సిఐ

**చేర్యాల (మద్దూరు), ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** సీసీ కెమెరాల ఏర్పాటుతో శాంతిభద్రతోపాటు నేరాలను నియంత్రించవచ్చని సీఐ ఎల్.శ్రీను తెలిపారు. సోమవారం మద్దూరులోని షాపు యజమానులు, ప్రజలకు సీసీ కెమెరాలపై సిఐ అవగాహన కల్పించారు. గ్రామాల్లోని దుకాణ సముదాయాల వద్ద యజమానులే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, ఒక కెమెరా షాప్ కోసం మరో కెమెరా రోడ్డు కనిపించేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుకోకుండా ఎక్కడైనా గొడవలు, దొంగతనాలు, చైన్‌స్నాచింగ్‌కాని సంఘటనలు జరిగినప్పుడు కేసులను వెంటనే చేదించవచ్చునని తెలిపారు. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని తెలియజేశారు. కెమెరాలు ఏర్పాటు చేసుకున్న వారు ప్రతిరోజు వాటిని ఎలా పని చేస్తున్నాయో మానిటర్ చేయాలన్నారు. అనంతరం హార్డ్‌వేర్ షాపు యజమాని ముతలిబ్ తన షాపులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న సందర్భంగా శాలువాతో సన్మానించి అభినందించారు. సిఐతో మద్దూరు ఎస్సై షెక్ యూనిస్ హమ్మద్, కానిస్టేబుల్లు పాల్గొన్నారు.

## ఎండిన కుంటలకు లీజును రద్దు చేయాలి

**-మత్స్యపారిశ్రామిక సంఘం డైరెక్టర్ పెండెల అయిలయ్య**

**హుస్నాబాద్, జనవరి 12, ప్రభాతవార :** హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్‌లోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల్లోని ఎండిపోయిన కుంటల లీజులను రద్దు చేయాలని కోరుతూ హుస్నాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి బెన్‌షాలోమ్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ ఎండిన కుంటలను లీజులకు ఇస్తే మత్స్యకారులపై అదనంగా భారం పడుతుందని, అందులో రెండు వేల చేపలు కూడా ఉండవని వివరించారు. ఈ విషయంపై ఆర్డీవో గుర్తించి జిల్లా కలెక్టర్‌కు నివేదికలు పంపి లీజులను రద్దు చేసేలా చేయాలని వారు వేడుకున్నారు. కార్యక్రమంలో రాగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ కొండం కవితసంపత్‌రెడ్డి, సురభి మల్టీస్పెషల్టి హాస్పిటల్ పిఆర్ఓ పర్శరాములు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని టిహెచ్ఆర్ నగర్ కాలనీలో సోమవారం సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, సురభి మెడికల్ కళాశాల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో వారు పాల్గొని మాట్లాడారు. గత నాలుగు రోజుల నుంచి సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఉచిత వైద్య శిబిరాలు నిరుపేదలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇది ముమ్మాటికి ప్రజా సంక్షేమ బడ్జెట్


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**మిరుదొడ్డి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్అన్ అకౌంట్ బడ్జెట్ ముమ్మాటికి ప్రజా సంక్షేమ బడ్జెట్ అని.. రాష్ట్రంలోని సబ్బండా వర్గాల ప్రజల సంక్షేమం కోసమే ప్రవేశపెట్టిన ప్రజా బడ్జెట్ అని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు చెన్నై భూపాల్‌గౌడ్ అన్నారు. సోమవారం అయన విలేకరులతో మాట్లాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వం మిగులు బడ్జెట్‌లో ఉన్నా రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసి రాష్ట్రాన్ని ఆర్థికంగా 50 యేండ్లు వెనక్కి తీసుకెళ్లిందన్నారు. రాష్ట్ర సంపదనను కల్వకుంట్ల కుటుంబం బిఆర్ఎస్ నాయకులు దోచుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆరుగ్యారెంటీలు అమలుచేసి తీరుతుందన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మద్దెల రాజేశం,మద్దెల సుదర్శన్, నేరెళ్ల భూమాగౌడ్, ఎల్లగొని ప్రభాకర్, నేరంళ్ల వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త):** లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 10వ వార్డు కౌన్సిలర్ రహీం అన్నారు. సోమవారం 10వ వార్డుకు చెందిన పేద కుటుంబానికి చెందిన కుమారిభాయ్ కూతురు వివాహానికి లయన్స్‌క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థిక సహాయం అందించగా కౌన్సిలర్ రహీం తన వంతుగా రూ.5వేల సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో పేదలను ఆదుకోవడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షుడు నేతి శ్రీనివాస్‌గుప్త, కొండపోచమ్మ ఆలయ మాజీ డైరెక్టర్ గోలి సంతోష్, లయన్ దొంతుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త):** పట్టణంలో శివసాయి దంత వైద్యశాల, ఎస్ఎస్ స్పోర్ట్స్ వారి ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. గత మూడు రోజుల నుంచి నిర్వహించిన క్రీడా పోటీలలో గజ్వేల్ నియోజకవర్గం నుండి దాదాపు 30 జట్లు పాల్గొన్నాయి. ఇందులో ఫైనల్ మ్యాచ్ రసవత్తరంగా కొనసాగింది. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి రాజుపాషా, ద్వితీయ బహుమతి ఉప్ప శ్రీనివాస్, మహేష్‌రెడ్డి కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏడిఎఫ్ఓ సురేష్‌కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శంకర్, సివిల్ ఇంజినీర్ రాజగురుప్రసాద్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జయప్రకాష్, భగవంత్, స్వరాజ్, సంతోష్, శేషాచారి, రాజు, శ్రీను, సుశీల్, రాధాకృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేసిన దృశ్యం

# పాఠశాల గుర్తింపు రద్దు.. ఎంఈవోను సస్పెండ్ చేయాలి

**ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిండెంట్ రామగల్ల నరేష్**

**హుస్నాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

నిబంధనలకు విరుద్ధంగా నడుస్తూ, విద్యాప్రమాణాలు పాటించని ఆల్ఫోర్స్ పాఠశాల గుర్తింపును రద్దుచేయడంతో పాటు తప్పుడు ధృవీకరణ పత్రాలతో పాఠశాలకు గుర్తింపునిచ్చిన హుస్నాబాద్ మండల విద్యాశాఖ అధికారి దేశిరెడ్డిని సస్పెండ్ చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య సిద్దిపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల నరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా విద్యాశాఖ డిఈఓకి సంఘం నాయకులతో కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్‌లో ఆల్ఫోర్స్ పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా నడవడంతోపాటు విద్యార్థులను మానసికంగా, శారీరకంగా వేశోస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నవారిపై మండల విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేసినా స్పదించడం లేదన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం నిబంధనలు పాటించని పాఠశాలకు ఎమ్ఈవో ఎలా అనుమతి ఇచ్చారో సమాశినం చెప్పాలన్నారు. జివో నెం1 ప్రకారం ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులకు డబుల్ ఫీజులు వసూలు చేస్తున్నా చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. అంతే కాకుండా విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాలలో ఉండాల్సిన ఫైర్ సేఫ్టీ, మరుగుదొడ్లు, గ్రౌండ్ లేవని ఈ విషయంపై జిల్లా విద్యాధికారులు వెంటనే స్పందించి పాఠశాల గుర్తింపు రద్దు చేయడంతో పాటు పాఠశాలకు అనుమతి ఇచ్చిన ఎమ్ఈవోను సస్పెండ్ చేయాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు వేల్పుల ప్రసన్నకుమార్, సిద్దుల సుమణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.


డిఈకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు


పాపన్నపేటలో మార్కండేయ జయంతిని జరుపుకుంటున్న దృశ్యం

## ఘనంగా మార్కండేయ జయంతి

**పాపన్నపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘం భవనంలో సోమవారం భక్త మార్కండేయ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మార్కండేయ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు బీకొండ రాములు మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడటంతో మార్కండేయుడు చేసిన సేవలు అమోఘమని కొనియాడారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు వల్లందేశీ శ్రీనివాస్ నేత, జిల్లా కార్యదర్శి నగేష్, సంఘం ఉపాధ్యక్షులు పడిగే కృష్ణ, నాయకులు పోల శ్రీనివాస్, బద్దపురం సంగమేశ్వర్, పల్లె సంగమేశ్వర్, యుగంధర్, కిరణ్, అరవింద్, తుకారాం, పూర్ణచందర్, మరెల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 21 వరకు ఓపెన్ పరీక్ష ఫీజు గడవు

**పాపన్నపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల ఫీజులను ఈ నెల 21వ తేదీలోగా చెల్లించుకునే అవకాశం ఉందని మండల కో-ఆర్డినేటర్ మహేశ్వర్, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ నరేందర్‌లు తెలిపారు. ఎప్రిల్, మే మాసాల్లో నిర్వహించబోయే ఓపెన్ 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు ఫీజును విద్యార్థుల సౌకర్యార్థం పెంచడం జరిగిందన్నారు. 10, ఇంటర్మీడియట్ పరీక్షల కొరకు ఒక్కొక్క సబ్జెక్టుకు రూ. 100 చొప్పున చెల్లించాలన్నారు. రూ. 25 ఫైన్‌తో ఈ నెల 27వ తేదీ వరకు, రూ. 50 ఫైన్‌తో మార్చి 4వ తేదీ వరకు చెల్లించుకునే అవకాశం ఉందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

## రాయసముద్రం చెరువును పరిశీలించిన కార్పొరేటర్


రాయసముద్రం చెరువును పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**సంగారెడ్డి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఓల్డ్ రామచంద్రాపురంలో గల రాయసముద్రం చెరువును సోమవారం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ అధికారులతో కలిసి పరిశీలించారు. చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కలతో దోమల బెడద అధికమయిందని స్థానికుల వినతి మేరకు కార్పొరేటర్ రాయసముద్రం చెరువును సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. చెరువులో పేరుకుపోయిన చెత్త, గుర్రపు డెక్కలను కార్పొరేటర్ దగ్గరుండి తొలగింప చేశారు. ఓల్డ్ రామచంద్రాపురం మజీద్ ముందు గల బస్తీలో ఓపెన్ డ్రైన్‌లో పేరుకుపోయిన చెత్తను కాలనీవాసుల వినతి మేరకు జలమండలి సిబ్బందితో తొలగింప చేయించారు. కార్పొరేటర్‌గా మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్‌ను బస్తీ వాసులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు కిరణ్ గౌడ్, చిగురు శ్రీను, రాములు యాదవ్, మాణయ్య, శోభ, మల్లికార్జున్, సిఎం మల్లేష్, ఉమారాణి, సుధాకర్, ఖాజా, మహేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలి


నల్ల బ్యాడ్జిలను దరించి నిరసన తెలుపుతున్న గురుకుల ఉపాధ్యాయులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** బదిలీలు పదోన్నతులు చేపట్టిన తర్వాతే నూతన నియామకాలు చేపట్టాలని గురుకుల ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం గురుకులాల్లో నూతన ఉపాధ్యాయుల నియామకాలు చేపడుతన్నందుకు నిరసనగా మండల పరిధిలోని నారాయణపూర్ లోగల తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాలలోని ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జిలను ధరించి నిరసన తెలియ జేయడం జరిగింది. 2018..2019 నుండి గురుకుల ఉపాధ్యాయులు 6 సంవత్సరాలుగా ఒకే చోట విదులు నిర్వహిస్తున్నామని పేర్కొంటున్నారు దూరమైన మైన ప్రాంతాల వారు నియమింపబడ్డారు. దూర ప్రాంతాల వారు 6 సంవత్సరాలుగా కుటుంబాలకు దూరంగా ఉండి విదులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు వారికి వెంటనే బదిలీలు, పదోన్నతులు కల్పించిన తర్వాతనే నూతన గురుకుల ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని వారు కోరుతున్నారు. ఈమేరకు ప్రభుత్వం స్పందించి ఇప్పటి వరకు గురుకులాల్లో 6 సంవత్సరాలుగా విదులు నిర్వహిస్తున్న గురుకుల ఉపాధ్యాయులకు వెంటనే బదిలీలు. పదోన్నతుల కల్పించాలని అటు తర్వాతనే నూతన నియామకాలు చేపట్టాలని వారు కోరారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్


జగన్నాథరావు కాలనీలో నడుస్తున్న పలు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అశోక్‌గౌడ్

**నర్సాపూర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** జగన్నాథరావు కాలనీలో నడుస్తున్న పలు అభివృద్ధి పనులను సోమవారం నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ పరిశీలించారు. కాలనీలో పర్యటించి మురికి కాలువల నిర్మాణ పనులు ఇతర అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి పలు సలహాలు సూచనలు చేశారు. పనుల్లో నాణ్యతగా ఉండేలా చూడాలని వారికి సూచించారు. కాగా కాలనీలోని పనులు వెంటనే పూర్తి చేయాలని వారికి తెలియజేయడం జరిగింది. మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్‌తో పాటు నాయకులు కొండి కుమార్, ఫైజాన్, సైఫ్ అలీ తదితరులున్నారు.

## ఎస్ఐ శ్రీకాంత్‌కు సన్మానం

**సంగారెడ్డి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** జహీరాబాద్ నుంచి బదిలీపై వెళుతున్న ఎస్ఐ శ్రీకాంత్‌ను సోమవారం ఎస్‌పి సిహెచ్ రూపేష్ చెన్నూరి ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. సోమవారం పట్టణంలోని పివిఆర్ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌పి రూపేష్ చెన్నూరి బదిలీపై పుల్కల్ ఠాణాకు వెళుతున్న శ్రీకాంత్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి డాక్టర్ అశోక్, డిఎస్‌పి వి రఘు, పట్టణ సిఐ ఆర్ రవి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్ఐ శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న దృశ్యం




జాతరకు వచ్చేవారికి కోలాటలతో స్వాగతం పలుకుతున్న మహిళా సంఘాలు, సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

# పచ్చసాలేలో ముగిసిన పాత పంటల జాతర

### హాజరైన నాబార్డ్, వ్యవసాయాధికారులు

**ఝరాసంగం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** జనవరి 14న డిడిఎస్ ఆధ్వర్యంలో ప్రారంభమైన 24వ పాత పంటల జాతర సోమవారం మండలంలోని మాచ్‌నూర్ గ్రామం పచ్చసాలేలో ఘనంగా ముగిసాయి. జాతర ముగింపు కార్యక్రమానికి అతిథులుగా మెదక్, సంగారెడ్డి నాబార్డ్ డిడియంలు సితిమోతి, కృష్ణతేజ, వ్యవసాయ శాఖ ఏడిఓ బిక్షపతి, డిడిఎస్ డైరెక్టర్ డాక్టర్ వి.రుక్మిణిరావు, హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వినోద్ పావురాల, డిడిఎస్ బోర్డు సభ్యులు ఇండియన్ ఆడిట్ ఆండ్ అకౌంట్స్ రిటైర్డ్ సర్వీస్ అధికారి వి వేదా కుమారి, సెంటర్ ఫర్‌సస్టేనబుల్ అగ్రికల్చర్, డిడిఎస్ బోర్డు సభ్యులు డాక్టర్ జివి రామాంజనేయులు, న్యాల్‌కల్ మండల ఎంపిపి అధ్యక్షులు, విత్తనాల సంరక్షకురాలు అంజమ్మ, వికాస విశాఖ పట్నం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ కిరణ్ హాజరుకాగా అందంగా అలంకరించిన ఎడ్ల బండ్లను మహిళా సంఘాలు కోలాటలు ఆడుదూ జానపద గేయాలు ఆలపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివధ రకాల స్టాల్స్‌ను సంప్రదాయ పండగల పద్దతులను, సంగ: రేడియోను అతిథులు సందర్శించారు.

ఈ సందర్భంగా డిడిఎస్ ఐరెక్టర్ వి రుక్మిణి రావు మాట్లాడుతూ 24 సంవత్సరాలు ముందు స్వర్గీయ డిడిఎస్ డైరెక్టర్ పివి సతీష్ సంఘం మహిళలతో కలిసి పాత పంటల జాతరను ప్రారం భించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. పాత పంటల జాతర నిర్వహణతో ప్రజల్లో పాత పంటల విత్తనాల భోజనంపై ఆసక్తి పెరిగిందని, ఫలితంగా ప్రపంచం పాత పంటలను వాటి విలువలను గుర్తు చేసుకుంటోందన్నారు. గ్రామాల్లో సైతం రైతులు పాత పంటల సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ మీడియా ట్రస్ట్ వారు 20 ఏళ్ల పాత పంటల జాతర అనే సినిమాను ప్రదర్శించగా అతిథులు, ప్రజలు సినిమాను ఆసక్తిగా తిలకించారు. జీవ వైవిద్య సంరక్షకులు, మహిళా రైతులు చిరాగ్‌పల్లి మరియమ్మ (హుసెల్లి), జాదవ్ సుశీలా బాయి (జంలైతండా), మలెలన రాములమ్మ (రేజింతల్), మల్లన్‌గారి రోజమ్మ (అల్గోల్), ములిగేరి మంజులమ్మ (బిడకన్నె), చిన్న రాథోడ్ జగన్ (ఓంట్లెలగడ్డ తండా) బాయికట్ట నర్సమ్మ (ఎల్గోయి)లను అతిథులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. పాత పంటల్లో ఉన్న పోషకాలతో కలగే ఆరోగ్యంపై అతిథులు వివరించారు.

## మున్నూరు కాపులు అన్ని రంగాల్లో ముందుండాలి

### బీఆర్ఎస్ సీనియర్ రాష్ట్ర నాయకులు గాలి అనిల్ కుమార్

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** మున్నూర్ కాపులు అన్ని రంగాల్లో ముందుండాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గాలి అనిల్‌కుమార్, జంట నగరాల కాపు సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు మిరియాల రాఘవురావు అన్నారు. ఆదివారం రాత్రి శ్రీకృష్ణ దేవరాయ కాపు సంఘం, ఇస్నాపూర్ వారి ఆధ్వర్యంలో అధ్యక్షులు సుబ్బారావు, వారి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మున్నూరు కాపు ఆత్మీయ కలయిక సమావేశం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో నిర్వహించారు. సమావేశానికి వారు ముఖ్య అతిధులుగా హజరై మాట్లాడుతూ మున్నూరు కాపుల అభివృద్ధి కోసం చర్చించారు. వారికి హెల్త్ ఇన్సురెన్స్ యొక్క ప్రాముఖ్యతను తెలియచేశారు. సుమారు రెండు వందల మందికి గాలి అనిల్ కుమార్ తన సొంత నిధులు, రూ.10లక్షలతో హెల్త్ ఇన్సురెన్స్ చేయించటానికి నిర్ణయించారు. ఈ సమావేశానికి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు అతిధులుగా హాజరయ్యారు. ముఖ్య అతిధులుగా ప్రముఖ పారిశ్రామికవేత్త గోవిందరావు, వ్యాపారవేత్త సోము సత్యనారాయణ, ప్రముఖ వైద్యులు, డాక్టర్ శ్రీకర్, ఇస్నాపూర్ సర్పంచి గడ్డం బాలమణి, శ్రీశైలం, ముత్తంగి సర్పంచి ఉపేందర్, సంగారెడ్డి జిల్లా మున్నూరు కాపు అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది యాదగిరి, సీనియర్ కాపునాయకులు, ఇస్నాపూర్ కాపు సంఘం ఫౌండర్ తిక్కిరెడ్డి విష్ణుమూర్తి, కాపు నాయకులు సత్తి హనుమాన్, అప్పారావు, పటాన్‌చెరు, అశోక్ నగర్, చందానగర్, అమీన్‌పూర్, గోపనపల్లి, బీడీఎల్ కాపు సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, కమీటి సభ్యులు హాజరయ్యారు.

## మల్లన్న స్వామి జాతరలో బీఆర్ఎస్ నాయకులు


మల్లన్న స్వామి జాతరలో బీఆర్ఎస్ నాయకులు గూడెం మధు సుధన్‌రెడ్డి

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** జిన్నారం మండలం శివనగర్ గ్రామంలో మల్లిఖార్జునస్వామి వారి జాతర మహోత్సవం సోమవారం ఆలయ నిర్వాహకులు గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధు సుధన్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌తో కలిసి ఈ జాతరలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆ స్వామి వారి కృపతో నియోజకవర్గం ప్రజలు ఆయురారోగ్యాలతో ఆనందాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, నాయకులు వెంకటేష్ గౌడ్, గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

## ఫైర్‌స్టేషన్ హోంగార్డుకు ఆర్థిక సహాయం

**గజ్వేల్, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త):** ఫైర్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్.యాదగిరి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి పెమ్మనబోయిడి సురేష్‌కుమార్ సోమవారం యాదగిరి వైద్య ఖర్చుల నిమిత్తం తన తోటి గజ్వేల్ అగ్నిమాపక కేంద్ర ఉద్యోగులు అందరు కలిసి రూ.50వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ తమ ఫైర్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న యాదగిరి ఆరోగ్యం కుదుటపడి విధుల్లోకి రావాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఎన్డీఏ పథకాలను గ్రామాల్లో ప్రచారం చేస్తున్న బిజెపి నాయకులు

## ఎన్డీఏ పథకాలపై గ్రామాల్లో ప్రచారం

జోగిపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త: ఎన్డీఏ ప్రభుత్వంలో అమలవుతున్న పలు ప్రభుత్వ పథకాలను గ్రామాల్లో ప్రచారం చేస్తున్నట్లు బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్‌గౌడ్ తెలిపారు. గావ్‌చలో కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని డాకూరు, నాదులాపూర్, కోడెకల్, ఇటిక్యాల, సంగుపేట, అల్మాయిపేట, చందంపేట గ్రామాల్లో పర్యటించి ఎన్డీఏ ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శ్యామాగౌడ్, మహెందర్‌లు పాల్గొన్నారు.

## అంతక్రియలో పాల్గొన్న నగేష్ శెట్కార్

**సిర్గాపూర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** మండలంలోని వాసగర్ గ్రామానికి చెందిన మురళి కిషానరావు సతీమణి అనారోగ్యంతో అనంత లోకాలకు చేరి పోవడంతో సోమవారం నిర్వహించిన అంతక్రియల్లో ఉమ్మడి మెదక్ జిల్లా ప్రణాళిక సంఘం సభ్యులు నగేష్ శెట్కార్ పాల్గొని కన్నీటి విడ్కోలు పలికారు. మురళి కిసాన్‌రావు కుటుంబాన్ని పరామర్శించి సానుబూతి ప్రకటించారు. అంత్యక్రియల్లో ధనజీ పాటిల్, శివాజీ పాటిల్, యేసప్ప, ముళి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## భక్త మార్కండేయలుకు ప్రత్యేక పూజలు

**సంగారెడ్డి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** పద్మశాలీల ఇలవేలుపుశ్రీ భక్త మార్కండేయ జయంతి వేడుకలను సోమవారం పట్టణంలోని మార్కండేయ ఆలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం వేణుబట్ సగ్గం శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ఆలయంలో రుద్రాభిషేకం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం పండాల్ మార్కండేశ్వర్‌చే అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంకాలం 6 గంటలకు మందిరం నుంచి జాతీయ రహదారి మీదుగా భవాని మందిరం, రాచన్నపేట హనుమాన్ మందిరం వరకు శోభాయాత్ర నిర్వహించారు. జయంతి ఉత్సవాలు పద్మశాలి సంఘం అధ్యక్షులు గడ్డం జనార్ధన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కర్దాస్ మనోహర్, పద్మ రమేష్ బాబు, కనుకుంట్ల నరసింహులు, కొండా శివరాజ్, ఒగ్గు విఠల్, దోమల పండరి, సగ్గం విఠల్, గడ్డం పాండు, గుండ్ల మల్లయ్య, కొడపాక నాగరాజు, పండాల మార్కండేశ్వర్, పగిడి మర్రి రాములు నేత, దాసరి పండరి, కొబ్బర లక్ష్మణ్, గూడ జగన్, గుంజోటి విజయకుమార్, సుదర్శన్ బండారి, సుదీర్ బండారి, జట్ల శివకుమార్, అరిగే అంజన్న, కోస్గి ప్రభు, పగడ శ్రీనివాస్, గడెద వెంకటేశం, మరెల్లి వెంకటయ్య, సగ్గం శ్రీనివాస్, మంత్రి వేరేశం, గుజ్జరి రాందాస్, గాజుల రామలింగం, ఇంజమూరి మల్లేశం, చిప్ప సత్యనారాయణ, కర్దాస్ సచిన్, పవన్ కుమార్, దండి విఠల్, గద్దె నరసింహులు, సోమ దత్తాత్రి, సోమ నవీన్, దిడ్డి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మార్కెండేయ స్వామి జయంతి

**నర్సాపూర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** భక్త మార్కెండేయ జయంతిని పురస్కరించుకొని నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో పద్మశాలీల ఆధ్వర్యంలో శ్రీశివభక్త మార్కెండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు జెండాను ఆవిష్కరించి మార్కండేయ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం శివభక్త మార్కెండేయుడి చరిత్ర గురించి తెలియ జెప్పడం జరిగింది. కాగా నూతనంగా నిర్మిస్తున్న భక్త మార్కెండేయ ఆలయానికి గడప (ద్వార భందనములు) బిగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. గడపకు శ్రీ సహస్రొల్ల దత్తు రామశర్మ వేద మంత్రోచ్ఛరణల మధ్యన ప్రత్యేక పూజలు నిర్వహించి శాస్త్రోక్తంగా ఆలయానికి బిగించడం జరిగింది. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షులు జయరాములు గ్రామ అధ్యక్షులు నక్క ప్రభాకర్, ఉపాధ్యక్షులు నక్క పెంటేష్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, సభ్యులు అర్జున్, స్వామి, శ్రవణ్, బోగ నాగేందర్, పెద్ద రాములు, విజయ్, ప్రశాంత్, శేఖయ్య, గుడా రాజు, దశరథ, సహ దేవ్, రమేశ్, జగదీష్, నక్క రాములు పాల్గొన్నారు.

**నర్సాపూర్‌లో...**

**నర్సాపూర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** పట్టణంలోని శివాలయంలో శ్రీభక్త మార్కెండేయ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. నర్సాపూర్ పట్టణానికి చెందిన కంది బబిత ప్రభాకర్ దంపతుల ఆధ్వర్యంలో భక్త మార్కెండేయ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా పూజలు నిర్వహించారు. కాగా ప్రభాకర్ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వీరు రెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న భక్త మార్కెండేయ ఆలయానికి రూ. 51,111 విరాళం ప్రకటించి చెక్కును రెడ్డిపల్లి శ్రీ మార్కెండేయ ఆలయ కమిటీ సభ్యులు నక్క ప్రభాకర్, నక్క పెంటేశ్‌లకు అందజేశారు. కార్యక్రమంలో పూజారి వివదీక్షగురుస్వామి వీరప్పగురూజీ, కౌన్సిలర్ సంగసాని సురేశ్, నాయకులు కొత్త శ్రీనివాస్‌గుప్త, నక్క అర్జున్ పాల్గొన్నారు.

**కౌడిపల్లిలో...**

**కౌడిపల్లి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో చేనేత పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మార్కెండేయ స్వామి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పద్మశాలీ సంఘం మండల అధ్యక్షులు పిశ్కె నర్సింలు పద్మశాలీ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా పిశ్కె నర్సింలు, డాక్టర్ పురుశోత్తం, రిటైర్డ్ ఎస్ఐ పిశ్కె శెట్టయ్య లు మాట్లాడుతూ పద్మశాలీయులు ఐక్యంగా ఉండి మన హక్కులను సాధించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పద్మదుర్గయ్య, పోల జనార్ధన్, సంబరపు తిరుమలేష్, భీమేష్, మంత్రి కృష్ణ, మంత్రి ఆంజనేయులు, అంకం ఆంజనేయులు, నరసింహులు, రవి, కృష్ణ, శ్రీనివాస్, ప్రభాకర్, నవీన్, పురుషోత్తం, పత్యనారాయణ, రంగేశ్, ఆదిత్య పాల్గొన్నారు.


రెడ్డిపల్లిలో పద్మశాలి జెండాను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు


కౌడిపల్లిలో మార్కెండేయ జయంతిలో పద్మశాలీ సంఘం నేతలు

## ఘనంగా జగద్గురువు రేణుకాచార్య ప్రథమ వార్షికోత్సవం

**ఝరాసంగం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని హనుమాన్ మందిరంలోని జగద్గురువు రేణుకాచార్య విగ్రహ ప్రతిష్ఠాపన ప్రథమ వార్షికత్సోవాన్ని సోమవారం వీరశైవ జంగమ సమాజం ఆధ్వర్యంలో భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. రుద్రాభిషేకం, అన్న ప్రసాద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భజన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో వీరశైవ జంగమ సమాజం అధ్యక్షులు రుద్రయ్యస్వామి, ఎల్ నాగేంద్ర స్వామి, శివ ప్రసాద్ స్వామి, సంగయ్యస్వామి, బసయ్యస్వామి, వీర్ సంగయ్యస్వామి, ఎల్ నాగయ్య స్వామి సంతోష్ కుమార్ స్వామి, టి భద్రప్ప, శంకర్, వీరు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి


ఎంపిడిఓకు వినతి పత్రం అందచేస్తున్న సిఐటియు నాయకులు

**పాపన్నపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** గ్రామ పంచాయితీ సిబ్బందికి వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు మండల కార్యదర్శి ఎల్ అశోక్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఇంచార్జి ఎంపిడిఓకు వినతి పత్రం అందచేసిన సందర్భంగా అశోక్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రత్యేక అధికారుల వేదింపులు ఆపాలని, మధ్యాహ్న భోజనానికి గంట సమయం కేటాయించాలని సూచించారు. కార్మికులకు గుర్తింపు కార్డులు అందచేయాలన్నారు. ప్రతి నెల సబ్బులు, నూనె అందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయితీ సంఘం సభ్యులు మాణిక్యం, పోచయ్య, లక్ష్మయ్య, గోపాల్ పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నీ విజేత రాయిపల్లి జట్టు


క్రికెట్ టోర్నీ కప్‌ను రాయిపల్లి జట్టుకు అందచేస్తున్న ఉజ్వల్‌రెడ్డి

**సంగారెడ్డి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి క్రికెట్ టోర్నమెంట్ విజేత జట్టుగా రాయిపల్లి (డి) సిసి జట్టు నిలచింది. జనవరి 26న ప్రారంభమైన ఉజ్వల్‌రెడ్డి క్రికెట్ టోర్నమెంట్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో నిర్వహించి ఫైనల్ మ్యాచ్‌ను జహీరాబాద్‌లోని బాగారెడ్డి స్టేడియంలో నిర్వహించారు. మండలల్లో విజేతగా నిలిచిన జట్టులు ఫైనల్ మ్యాచ్‌లో తలపడ్డాయి. జహీరాబాద్ స్టార్స్ రన్నర్‌గా నిలిచింది. విజేత జట్టుకు 2 లక్షల నగదు, రన్నర్ జట్టుకు 1 లక్ష రూపాయలతో పాటు కప్పులను అందచేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, ఎంపిపి గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నారాయణరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

## 16 పంచాయతీల అభివృద్ధికి రూ. 80 లక్షలు మంజూరు

### -కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నగులగారి మల్లేశంగౌడ్


మాట్లాడుతున్న మల్లేశం గౌడ్

**కొల్చారం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు 80 లక్షల రూపాయలను కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగులగారి మల్లేశం గౌడ్ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మల్లేశం గౌడ్ మాట్లాడుతూ 16 పంచాయితీలలో ఉపాధి హామి పథకంలో 5 లక్షల రూపాయల చొప్పున 80 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షులు ముతనయం గారి గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి గంగసాని మహేశ్వర్‌రెడ్డి, కోశాధికారి చందాపురం మధుసూదన్‌రెడ్డి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు సయ్యద్ అక్రమ్, రంగంపేట గ్రామ అధ్యక్షులు గండకృష్ణ, కుమార్ గౌడ్, నాయకులు వెంకట్‌గౌడ్, రాజు, కొల్చారం మాజీ సర్పంచ్ ఆశన్న, శ్రీశైలం, ఓబిసి సెల్ నాయకులు మురళీధర్ పంతులు, అప్పాజీపల్లి గ్రామ నాయకులు పహాస్, నాగరాజు గౌడ్, దేవన్నగారి శేఖర్ పాల్గొన్నారు.

## అల్లాదుర్గంలో భక్తిశ్రద్దలతో మార్కండేయ జయంతి


అల్లాదుర్గంలో మార్కండేయ జయంతిని జరుపుకుంటున్న భక్తులు

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో సోమవారం భక్త మార్కండేయ జయంతి వేడుకలను భక్తిశ్రద్దలతో జరుపుకున్నారు. గ్రామంలోని మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ప్రసాద వితరణ(అన్నదానం) నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం బాధ్యులు, ఆలయ కమిటి సభ్యులు కాల రాములు, సిందోల్ లక్ష్మన్, నామ లక్ష్మణ్, శ్రీకాంత్, గద్దె పెంటయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

**చిన్నశంకరంపేటలో...**

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** మార్కండేయ జయంతిని చిన్నశంకరంపేటలో పద్మశాలి సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో సోమవారం మార్కండేయుని ఆలయంలో పూజలు నిర్వహించి, అనంతరం పద్మశాలి సంఘం జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మార్కండేయుని పురాణం, విన్న చదివిన, చెప్పిన అపారమైన కీర్తి, ఐశ్వర్యం, ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనం నర్సింలు, పట్టణ అధ్యక్షులు కిష్టయ్య, ప్రధాన కార్యదర్శి అంబదాస్, మండల కార్యవర్గ సభ్యులు తుమ్మల శంకర్, వివిధ గ్రామాల అధ్యక్షులు, పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.


పద్మశాలి సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు